క్లుప్తంగా

కండలేరులో 11.325 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 11.325 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నెరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్తీక పూజలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

గూడూరురూరల్: గూడూరు గ్రామదేవత శ్రీతాళమ్మ దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కార్తీక మాస పూజల కోసం ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దాతలు సహకరించాలని కోరారు. కమిటీ సభ్యులు చెంచయ్య గౌడ్, చంద్రయ్యగౌడ్, చిన్నగౌడ్, పెంచలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న రోహిణి

గూడూరురూరల్: స్థానిక త్యాగరాజావీధిలోని శ్రీకల్యాణ వీరభద్రస్వామి దేవస్థానం వద్ద ఆదివారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో 37 మంది పేద దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, దాత స్వర్ణలతమ్మ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు విష్ణువందన, మహిళా మండలి అధ్యక్షురాలు జమునమ్మ, కార్యదర్శి స్నేహలతారెడ్డి, లక్ష్మి, అనిత, రెడ్ సంస్థ అధ్యక్షుడు జానా సుధీర్ పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే ఓట్లు



మాట్లాడుతున్న నాగరాజుగౌడ్

శ్రీకాళహస్తి: బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే తమ ఓట్లు వేస్తామని ఆ సంఘం నాయకులు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో రాజకీయంగా, ఆర్థికంగా బీసీలు వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు బీసీలను ఓ ఓటు బ్యాంకుగా చూస్తున్నారని తెలిపారు. బీసీలకు రాజ్యాధికారం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షణీయమన్నారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీ కులగణన ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేయాలని, అలాంటి పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గురుసాయి, సోమశేఖర్ ఆచారి, మధుసూదన్‌రావు, కిరణ్, కుమార్‌గౌడ్, బాల, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. నగరంలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంలో వెళుతున్న రాజా అనే యువకుడిని ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేటు అంబులెన్స్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన యువకుడిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు కాజూరు సమీపంలోని ఓ పెట్రోలు బంకు సమీపంలో బైకుపై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. అతన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్వర్ణబిందు ప్రాసనకు స్పందన

వరదయ్యపాళెం: మండలంలోని లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లల్లో రోగ నిరోధక శక్తి, జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు స్వర్ణబిందు ప్రాసన కార్యక్రమం చేపట్టారు. దీనికి విశేష స్పందన లభించింది. ఏకం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో 300 మంది పిల్లలకు స్వర్ణబిందు ప్రాసన చుక్కల మందు పంపిణీ చేశారు. ప్రాచీన భారతీయ కశ్యప ఆయుర్వేద శాస్త్రం ప్రకారం తయారు చేసిన ఈ మందును పిల్లలకు ఉచితంగా అందజేస్తున్నట్లు లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ పేర్కొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- సంక్షేమ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేసిన కుల్లూరు వాసులు
- గడప గడపలో అపూర్వ స్పందన



వెంకటరెడ్డిపల్లెలో లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కలువాయి: వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలువాయి మండలం కుల్లూరు సచివాలయం పరిధిలోని వెంకటరెడ్డిపల్లెలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అందరి సంక్షేమం కోసం పరితపించే నాయకుడు దొరకడం మన అదృష్టం అని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని చెప్పారు. ఆయన పాలనపై ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు చేరుతున్నాయన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళల కోసం పలు పథకాలు అమలు చేస్తూ వారి అభిమానాన్ని చూరగొన్నారన్నారు. ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి మరో కొత్త కార్యక్రమం ×వై ఏపీ నీడ్స్ జగన్ శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. ప్రజలతో మమేకం కావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పార్టీ నాయకులతో కలిసి ప్రతి సచివాలయం పరిధిలో రాత్రి బస చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించి వారి మద్దతు కోరుతామన్నారు. తద్వారా ముఖ్యమంత్రి చెప్పిన విధంగా వైనాట్ 175 తప్పకుండా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, ఎంపీటీసీ రాజమ్మ, జేసీఎస్ కన్వీనర్ మాదాసు పవన్, పార్టీ నాయకులు ఎంవీ కృష్ణారెడ్డి, రోశిరెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, వెంకటనరసయ్య, సుబ్బరాయుడు, పొంకు శ్రీనివాసులు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నేడు వెంకటగిరిలో గడప గడపకు..

వెంకటగిరి రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ సచివాలయం పరిధిలోని 6వ వార్డులో సోమవారం ఉదయం 6 గంటలకు మేలు కొలుపు కార్యక్రమంలో భాగంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు తెలిపారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

తుమ్మలతలుపూరులో..

సైదాపురం: మండలంలోని తుమ్మలతలుపూరు సచివాలయం పరిధిలోని చెర్లోపల్లె, తుమ్మలతలుపూరు గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

10 నుంచి చెకుముకి పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

గూడూరురూరల్: ప్రజల్లో మూఢ నమ్మకాలను తొలగించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ అన్నారు. గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఆదివారం చెకుముకి సైన్స్ పరీక్షలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఈ పరీక్షలను నవంబర్ 10న పాఠశాల స్థాయిలో, 30న మండల స్థాయిలో, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలో, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయిలో జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు పురుషోత్తమరావు, రామ్మోహన్‌రావు, సాయికిరణ్, గుర్రం విజయబాబు, విష్ణు, శ్రీను, గోపి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మహిళలు సంతానం కోసం ఆలయంలోని రావి చెట్టు, త్రిశూలం వద్ద వరపడ్డారు. ఊయల కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ట్రస్టు చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

మృతుల ఓటర్లను తొలగిస్తున్నాం



తిప్పగుంటపాళెంలో బీఎల్‌ఓలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్

చిల్లకూరు: మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బీఎల్‌ఓలు సర్వే చేపట్టి మృతిచెందిన వారి ఓట్లను తొలగించినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆదివారం మండలంలోని చిల్లకూరు, తిప్పగుంటపాళెం, చేడిమాల, పారిచెర్లవారిపాళెం గ్రామాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పారదర్శంగా ఓటర్ల జాబితా ఉండేలా చూడాలని బీఎల్‌ఓలను ఆదేశించామని తెలిపారు. తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఎక్కడైన రిమార్కులు వస్తే సంబంధిత బీఎల్‌ఓలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రస్ట్ నిర్వాహకులకు సన్మానం



ట్రస్ట్ నిర్వాహకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఓజిలి: మండలంలోని బట్లకనుపూరు పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్న వున్నం సేవా ట్రస్ట్ నిర్వాహకులు వున్నంరెడ్డి రాధారెడ్డి, మధుసూదన్‌రెడ్డిలను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీరు, విద్యుద్దీపాలు, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలను కల్పించారని కొనియాడారు. అదే విధంగా విద్యార్థులు చదువుకోవడానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి – పిచ్చాటూరు రోడ్డులో నడిచే ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఆదివారం తిమ్మసముద్రం వద్ద మైసురారెడ్డి, షణ్ముగం దాడి చేశారు. బాధితుడు వినోద్‌కుమార్ కేవీబీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నుంచి బయలుదేరుతున్న సమయంలో రాజీవ్‌నగర్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఫోన్ మాట్లాడుతుతూ ద్విచక్ర వాహనంలో వెళుతున్నారని తెలిపారు. పక్కక వెళ్లాలని రెండు సార్లు హారన్ కొట్టినట్టు పేర్కొన్నారు. వారు తనను అంతు చూస్తామని బెదిరించారని తెలిపారు. తాను పట్టించుకోకుండా వెళుతుండగా తిమ్మససముద్రం వద్ద బస్సును అడ్డగించి దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడిని అన్ని యూనియన్ల నాయకులు ఖండించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు రక్షణ లేకుండా పోయిందన్నారు. విధుల్లో ఉన్న వారిపై దాడి చేయడం తగదన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

రాపూరులో భారీ వర్షం



రాపూరులో కురుస్తున్న వర్షం



నిమ్మ తోటలో నిలిచిన వర్షపు నీరు

రాపూరు: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం జల్లులతో మొదలై సాయంత్రానికి భారీ వర్షంగా మారింది. దీంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి వాతావరణం చల్లబడింది. సకాలంలో వర్షం కురవడంతో నిమ్మ రైతులు హర్షం వ్యక్తం చేశారు. నిమ్మ చెట్లకు నీరులేక ఎండిపోతున్న సమయంలో వర్షం కొంత ఊరట కలిగించిందని పేర్కొన్నారు.

సైదాపురంలో మోస్తరు వర్షం



సైదాపురంలో కురుస్తున్న వర్షం

సైదాపురం: మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి మోస్తారు వర్షం కురిసింది. ఎగువ ప్రాంత్రాల నుంచి కై వల్య నదిలోకి నీకు చేరింది. కాగా ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల ప్రభావం అంతంత మాత్రమేనని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. తొందరపడి నార్లు పోసుకోవద్దని ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయాధికారులు రైతులకు సమాచారం అందజేస్తున్నారు. బోరుబావులు ఉన్న రైతులు నీటి సదుపాయాన్ని బట్టి నార్లు వేసుకోవాలని ఏఓ హైమావతి సూచించారు. మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో నిమ్మ తోటలు సాగు చేస్తున్నారు. సమయానికి వర్షం కురవడంతో నిమ్మ రైతులకు ఊరట లభించింది.

డిసెంబరు 6న ఏడు గంగమ్మల జాతర



ఏడుగంగమ్మల కమిటీ సభ్యులతో పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో డిసెంబరు 6న నిర్వహించే ఏడుగంగమ్మల జాతరను విజయవంతం చేద్దామని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద గల కల్యాణ మండపంలో ఆదివారం ఏడు గంగమ్మల ఆలయ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఇందులో ముఖ్య అతిథిగా అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 3న జాతర చాటింపు ఉంటుందని తెలిపారు. 5వ తేదీన శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఏడు గంగమ్మలకు సారె సమర్పిస్తామని పేర్కొన్నారు. ఇందులో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. డిసెంబరు 6న జాతర అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. జాతర అయిన తరువాత శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో ఏడుగంగమ్మల ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తామని చెప్పారు. అదే విధంగా తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ, వెంకటగిరి పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగలుగాఆ ప్రకటించారని, శ్రీకాళహస్తి ఏడు గంగమ్మల జాతరను కూడా రాష్ట్ర పండుగగా ప్రకటించాలని పాలకమండలి తీర్మానం చేస్తూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించనున్నట్లు తెలిపారు. వారిద్వారా ముఖ్యమంత్రిని ఒప్పించి ఏడుగంగమ్మల జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణమూర్తి, కరుణాకర్‌గురుకుల్, పాలమంగళం రవి, నాదముని, సెన్నీరుకుప్పం శేఖర్, షణ్ముగం, మొగరాల గణేష్, హరినాథ్‌నాయుడు, కార్తికేయ, జలకం కిషోర్, కంఠా ఉదయ్, గరికపాటి చంద్ర, శేఖర్, సత్య, శంకర్, బుగ్గ హరి, మచ్చవిజయ్, జగదీష్, బాలు, హర్ష, నితిన్ పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు స్టేడియం ఇవ్వొద్దు



స్టేడియంలో నిరసన వ్యక్తం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు

- వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

గూడూరురూరల్: పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియాన్ని దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలకు ఇవ్వొద్దని వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్టేడియంలో వాకర్స్, క్రీడాకారులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పట్టణ నడిబొడ్డులో ఉన్న స్టేడియం నిత్యం వాకర్స్‌కు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. టపాసుల దుకాణాలకు స్టేడియాన్ని అప్పగిస్తే వాకర్స్‌తో పాటు క్రీడాకారులకు ఇబ్బందిగా మారుతుందన్నారు. దుకాణాల ఏర్పాటు కోసం నిర్వాహకులు స్టేడియాన్ని తవ్వేస్తారని, అస్తవ్యస్తంగా తయారవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తున్నందున స్టేడియం బురదమయంగా, రొచ్చురొచ్చుగా ఉందని, టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తే స్టేడియం రూపురేఖలు కోల్పోతుందన్నారు. ఉన్నతాధికారులు వాకర్స్, క్రీడాకారుల విజ్ఞప్తిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకట్రామయ్య, శీనయ్య, గిరి, మల్లవరపు నాగేశ్వరరావు, చంద్రయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుని సేవలో సినీనటి జయలలిత





అన్నదాన సత్రంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న జయలలిత, ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో..

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని సినీ నటి జయలలిత ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం స్వామివారి అన్నదాన సత్రంలో భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి తమ ఆరాధ దైవమని ఆమె తెలిపారు.

దూదేకుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఫెడరేషన్ అధ్యక్షుడు చాంద్‌బాషా

గూడూరురూరల్: దూదేకుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ పనిచేస్తోందని నూర్‌బాషా దూదేకుల కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ అధ్యక్షుడు చాంద్‌బాషా అన్నారు. గూడూరు మండలం తిప్పవరప్పాడు గ్రామంలోని బీసీ కాలనీలో ఆదివారం నూర్‌బాషా దూదేకుల కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. చాంద్‌బాషా మాట్లాడుతూ.. 2018లో సొసైటీని ఏర్పాటు చేశామని తెలిపారు. తిరుపతి జిల్లాలో కలిసిన తరువాత ఇటీవల సింహగర్జన సభ నిర్వహించినట్లు తెలిపారు. దూదేకుల కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. ఫెడరేషన్ ప్రతినిధులు రహీమ్, కాలేషా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత జనగణనకు ప్రాధాన్యత ఇవ్వాలి



నక్కా వెంకటేశ్వరరావుకు ఆహ్వానం పలుకుతున్న కమిటీ సభ్యులు

సైదాపురం, వెంకటగిరి రూరల్: చేనేత జనగణనకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ నక్కావెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం వెంకటగిరిలో తిరుపతి జిల్లా చేనేత కమిటీ సదస్సుకు హాజరుకావాలంటూ వీవర్స్ కమిటి ప్రతినిధులు పలువురు ప్రతినిధులకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ కన్కా వెంకటేశ్వరరావుకు శాలువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మిక సంఘాలు, రాజకీయ విభాగాల కలయికతో జాతీయ స్థాయిలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. వీవర్స్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా కమిటీ ఏర్పాటులో అన్ని సామాజిక వర్గాల కలయికతో ప్రతిపాదనలు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాపకు మారస్వామి, కోడిపల్లిరాజా, మన్నెముద్దు శ్రీనివాసులు, గుత్తిత్యాగరాజు, గిరిప్రసాద్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలి



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్

దొరవారిసత్రం: ప్రతి బీఎల్‌ఓ ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలని తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెలబల్లి గ్రామ పరిధిలోని 150, 151 పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన శిబిరాల్లో కొత్త ఓట్లు, మార్పులు, చేర్పులకు వందల సంఖ్యలో దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందినట్లు తహసీల్దార్ తెలిపారు. క్షుణ్ణంగా పరిశీలించి ధ్రువీకరిస్తామని చెప్పారు.

బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్యలు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతోనే సమస్యలు వస్తున్నాయని పలువురు విమర్శలు చేస్తున్నారు. బస్టాండ్‌కు రోజూ వందల సంఖ్యలో బస్సులు వచ్చిపోతుంటాయి. రోజుకు 1.50 లక్షల మంది ప్రయాణికులు బస్టాండ్ ఆధారంగా రాకపోకలు సాగిస్తున్నారు.ఈ క్రమంలో ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వచ్చిపోయే బస్సులతో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి. అయితే ఆ దిశగా అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో దీర్ఘకాలంగా ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ట్రాఫిక్ నేపథ్యంలో బస్సు బస్టాండ్‌లో నుంచి ప్రయాణికులతో బయటకు వెళ్లడానికి 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతుంది. అయితే ఇటీవల శ్రీనివాస సేతును అందుబాటులోకి తీసుకువచ్చినప్పటికి బస్టాండ్‌లో పటిష్టమైన చర్యలు చేపట్టకపోవడంతో ఇక్కట్లు ఎదురుక్కొంటున్నారు. ఈ విషయంపై అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడును వివరణ కోరగా లోటుపాట్లు ఉంటే సవరిస్తామని...ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతామని తెలిపారు.

అండర్-14 క్రికెట్ సెలక్షన్స్ ప్రారంభం



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జయప్రకాష్

పుత్తూరు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలుర అండర్-14 క్రికెట్ సెలక్షన్స్‌ను ఆదివారం స్థానిక ఎస్ఆర్ఎస్ జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన దేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రతి క్రీడాకారుడు తమ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర, జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 150 మంది క్రీడాకారుల నుంచి జిల్లా ప్రాబబుల్స్ జట్లను ఎంపిక చేశారు. వీరికి నగరిలో రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం సుందరం, ఎస్జీఎఫ్ సెక్రటరీ సురేష్, సర్పంచ్ కృపాకరన్, పీడీలు పాల్గొన్నారు.